ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
గురువారం 7 మార్చి 2024



ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం మాట మార్చి ప్రజల నుంచి డబ్బు వసూలు చేయడం కోసం ఎల్‌ఆర్‌ఎస్‌ను తెరపైకి తెచ్చిందని, వెంటనే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిద్దిపేట జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ధర్నా చేపట్టారు.

వార్తలు 8లో..

మండుటెండల్లో మత్తళ్లు

రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో క్రమంగా భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. పంట పొలాలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అయితే, సిద్దిపేట శివారులోని రంగనాయకసాగర్ కుడి, ఎడమ కాలువ ద్వారా యాసంగి పంటకు ఇటీవల నీటిని విడుదల చేశారు. చెరువులు, చెక్‌డ్యాంలలోకి రంగనాయకసాగర్ కాలువల ద్వారా నీరు వచ్చి చేరుతుండటంతో జలకళను సంతరించుకుని మత్తళ్లు దుంకుతున్నాయి.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్




సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లిలో మత్తడి దుంకుతున్న చెక్‌డ్యాం



మత్తడి దుంకుతున్న సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని నర్సాపూర్ గుండ్ల చెరువు



సిద్దిపేటలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



అభ్యర్థుల కోసం అన్వేషణ

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో తర్జనభర్జన.. బీజేపీలో పోటాపోటీ

ఉమ్మడి మెదక్ జిల్లాలో లోక్‌సభ ఎన్నికలకు ప్రధాన పార్టీల కసరత్తు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి మార్చి 6 : ప్రత్యేక రాష్ట్రం వచ్చిన నాటి నుంచి దాదాపు పదేళ్ల అధికారంలో ఉన్న పార్టీ ఒకటి.. తాజాగా అధికారంలోకి వచ్చిన పార్టీ మరొకటి... ఈ రెండు పార్టీలు ఉమ్మడి జిల్లాలో లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల ఎంపికపై మల్లగుల్లాలు పడుతున్నాయి. మెదక్, జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల కోసం అన్వేషణ సాగిస్తున్నాయి. ప్రత్యర్థులను ఎదుర్కొని విజయం సాధించడానికి అవసరమైన అంగబలం, అర్థబలం ఉన్నవారిని ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తున్నాయి. మరోవైపు కేంద్రంలో మరోసారి అధికారంపై ఆశలు పెట్టుకున్న బీజేపీలో మాత్రం టికెట్ కోసం పోటాపోటీ నెలకొన్నది. ఆశావహులు ఎక్కువ కావడం కమలం పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారింది.

మెదక్ నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

బీఆర్‌ఎస్ ఆధిపత్యం కొనసాగుతున్న మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అభ్యర్థిత్వం దాదాపు ఖరారయినట్టేనని తెలుస్తున్నది. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్ నుంచి సంకేతాలు రావడంతో ప్రతాప్‌రెడ్డి గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో ప్రచారం మొదలుపెట్టారు. ఇక, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు సరైన అభ్యర్థి కోసం వెతుకుతున్నది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో పాటు పటాన్‌చెరుకు చెందిన బీసీ నాయకుడు నీలం మధు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. మైనంపల్లి హన్మంతరావు గతంలో మెదక్, మల్కాజ్‌గిరిల నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్‌రావు మెదక్ ఎమ్మెల్యేగా ఉన్నారు. నియోజకవర్గంలో విస్తృత పరిచయాలు ఉన్నందున తనకు విజయావకాశాలుంటాయని ఆయన పార్టీ నాయకత్వానికి వివరించినట్టు తెలిసింది. నీలం మధు గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున పటాన్‌చెరు టికెట్ ఆశించారు. ఈ పార్టీ టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. అక్కడా టికెట్ దక్కకపోవడంతో బీఎస్పీలో చేరి పోటీచేసి ఓడిపోయారు. ఎన్నికల అనంతరం తిరిగి కాంగ్రెస్‌లో చేరిన మధు పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ నుంచి టికెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు.

మెదక్ బీజేపీలో టికెట్ లొల్లి

మెదక్ పార్లమెంట్ అభ్యర్థి ఎంపిక బీజేపీలో చిచ్చురేపుతున్నది. పార్టీ టికెట్ తనకే వస్తుందన్న నమ్మకంతో మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు ప్రచారం చేసుకున్నారు. గజ్వేల్ ప్రాంతానికి చెందిన నాయకుడు గురువారెడ్డి కూడా వాల్‌పోస్టర్లు, సోషల్‌మీడియా ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. మరోవైపు, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. వీరు ముగ్గురూ కాకుండా ఇటీవల బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన గోదావరి భర్త, పారిశ్రామికవేత్త అంజిరెడ్డి కూడా పార్టీ టికెట్ కోసం పట్టుబడుతున్నారు. అందుకే మొన్న జరిగిన ప్రధాని నరేంద్రమోదీ సభను ఆయన పటేల్‌గూడలోని తన భూమిలోనే జరిపించారు. జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ ఆశించిన మాజీ కేంద్రమంత్రి, దివంగత ఆలె నరేంద్ర కుమారుడు ఆలె భాస్కర్ సైతం మారిన పరిస్థితుల నేపథ్యంలో మెదక్ పార్లమెంట్ టికెట్‌ను ఆశిస్తున్నారు. జహీరాబాద్ టికెట్ బీబీ పాటిల్‌కు దక్కడంతో మెదక్ స్థానమైనా తనకు కేటాయించాలని ఆయన పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తున్నది. తాజాగా, బీఆర్‌ఎస్‌కు చెందిన చెవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని కూడా బీజేపీ పరిశీలిస్తున్నట్టు వార్తలు రావడం ఆ పార్టీలో కలకలం రేపుతున్నది. ఆయన బీజేపీలో చేరి మెదక్ టికెట్ పొందవచ్చని పార్టీలో ఊహాగానాలు సాగుతున్నాయి. దీంతో, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల కంటే బీజేపీలో మెదక్ టికెట్‌కు పోటీ ఎక్కువగా ఉన్నది.

జహీరాబాద్ నుంచి గాలి అనిల్‌కుమార్?

సిట్టింగ్ ఎంపీ పార్టీ మారడంతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు అభ్యర్థి ఎంపిక కష్టంగా మారింది. ఆ పార్టీ నుంచి వరుసగా రెండుసార్లు ఎంపీగా గెలిచిన బీబీపాటిల్ ఇటీవల బీజేపీలో చేరి.. ఆ పార్టీ టికెట్ దక్కించుకున్నారు. దీంతో అభ్యర్థి ఎంపికపై బీఆర్‌ఎస్ మల్లగుల్లాలు పడుతున్నది. ఈ నేపథ్యంలో పటాన్‌చెరుకు చెందిన గాలి అనిల్‌కుమార్‌ను జహీరాబాద్ నుంచి బరిలో దింపాలని గులాబీ పార్టీ నాయకత్వం యోచిస్తున్నట్టు తెలిసింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ తరఫున మెదక్ నుంచి పార్లమెంట్‌కు పోటీచేసి ఓడిపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి టికెట్ ఆశించి భంగపడడంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంతో సంబంధాలు లేకపోయినా.. నాయకత్వం ఆయనను ఎంపిక చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో సుమారు 1.25 లక్షల మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన ఓట్లు ఉండడంతో అదే సామాజికవర్గానికి చెందిన అనిల్‌కుమార్ వైపు బీఆర్‌ఎస్ మొగ్గు చూపుతున్నది. దీనికితోడు ఆర్థికంగా బలంగా ఉండడం కూడా అనిల్‌కుమార్ వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణమని తెలుస్తున్నది. అయితే, పార్టీకి చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు గాలి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. నియోజకవర్గంలో రెండున్నర లక్షలకుపైగా లింగాయత్ సామాజికవర్గం ఓట్లున్నాయని.. కాంగ్రెస్, బీజేపీలు ఆ సామాజికవర్గ అభ్యర్థులనే పోటీలో దింపుతున్నాయని గుర్తుచేస్తున్నారు. లింగాయత్ అభ్యర్థినే పోటీలో నిలబెడితే గెలిచే అవకాశాలుంటాయని వారు తమ అభిప్రాయాలను పార్టీ నాయకత్వం ముందుంచుతున్నట్టు తెలిసింది. మరోవైపు, కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ అభ్యర్థిత్వం ఖరారయినట్టేనని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

అధిక వడ్డీ ఆశ చూపించి.. రూ. కోట్లలో మోసం

దబ్బు చెల్లిస్తానని.. వాయిదాకు ఒక రోజు ముందు కుటుంబంతో అదృశ్యం

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

తూప్రాన్, మార్చి 6: చిట్టీలు నడుపుతూ, గృహరుణాలు ఇప్పిస్తూ నమ్మకంగా మెసులుకున్న వ్యక్తి.. అధిక వడ్డీ ఆశ చూపించి రూ. కోట్లలో వసూలు చేసి అదృశ్యమైన ఘటన తూప్రాన్‌లో వెలుగుచూసింది. ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద రూ. లక్షల్లో తీసుకుని, మంగళవారం చెల్లింపులు చేస్తానని వాయిదా పెట్టి.. ఒకరోజు ముందు నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ పట్టణానికి చెందిన బిజిలిపురం యాదగిరి (37) ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ చిట్టీలు నిర్వహించేవాడు. రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు చిట్టీలను నాలుగైదేళ్లుగా నమ్మకంగా నిర్వహిస్తున్నాడు. అలాగే, గ్రామకంఠం భూములకు గృహరుణాలు ఇప్పిస్తున్నాడు. చిట్టీలు వేసినవారికి డబ్బులు ఇవ్వకుండా అధిక వడ్డీ ఆశ చూపి వాడుకోవడం మొదలుపెట్టాడు. అలాగే గృహరుణాలు ఇప్పించి వచ్చిన డబ్బును కూడా అధిక వడ్డీ ఇస్తానని తీసుకునేవాడు. నూటికి రూ.5 నుంచి రూ. 20 వరకు వడ్డీ ఇస్తాననడంతో పలువురు పెద్దమొత్తంలో డబ్బులు ఇచ్చారు. అంతేకాకుండా వడ్డీకి డబ్బు ఇప్పించేందుకు మధ్యవర్తులను నియమించుకుని వారికి కమీషన్ ఇస్తున్నాడు. డబ్బులు ఇచ్చినవారి నుంచి ఒత్తిడి పెరగడంతో మంగళవారం డబ్బులు ఇస్తానని పలువురికి వాయిదా పెట్టాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం పెద్దగుట్టకు వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి భార్య, ఇద్దరు పిల్లలతో అదృశ్యమయ్యాడు. యాదగిరి తల్లి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. విషయం పత్రికల్లో రావడంతో బుధవారం బాధితులు పెద్దఎత్తున పోలీసుస్టేషన్‌కు వచ్చారు. ఇప్పటివరకు 46 మంది నుంచి రూ.7 కోట్ల వరకు మోసపోయినట్లు ఫిర్యాదులు వచ్చాయని పోలీసులు తెలిపారు. కాగా, పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారి సంఖ్య గంటగంటకు పెరుగుతుండడంతో బాధితుల సంఖ్య వందకు పైగా ఉంటుందని.. రూ.35 కోట్ల వరకు మోసం చేసిఉండవచ్చని ప్రచారం జరుగుతున్నది.

నా కొడుకు రూ.75 లక్షలు ఇచ్చాడు

యాదగిరి తమ్ముడికి నా కూతురిని ఇచ్చాము. భూమి అమ్మగా వచ్చిన రూ.75 లక్షలు నా కొడుకు నాగరాజు వద్ద తీసుకున్నాడు. అల్లుడి వద్ద రూ. 10లక్షలు తీసుకున్నాడు. ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద రూ. లక్షల్లో తీసుకున్నట్టు చెప్పుకుంటున్నారు. మా డబ్బులు తిరిగి వస్తాయో.. లేదోనని ఆందోళనగా ఉన్నది.

- బాలమణి, ప్రజ్ఞాపూర్

డబుల్ ఇళ్లు కబ్జా..!

- లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో ఇష్టారాజ్యం
- ఇళ్లలో నేతల అనుచరుల పాగా
- బంధువులను తీసుకొచ్చి తిష్ట
- కొందరికి కేటాయించినా.. అందని సర్టిఫికెట్లు

దుబ్బాక, మార్చి6: గత ప్రభుత్వం దుబ్బాకకు 2017లో సుమారు 1200 డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేసింది. అందులో దుబ్బాక మున్సిపాలిటీలోని బల్వంతాపూర్ రోడ్డులో 744 ఇళ్లను నిర్మించారు. 82 ఇళ్లను మల్లాయపల్లి రహదారి వద్ద హమాలీల కోసం నిర్మించారు. అయితే, అప్పటికీ దుబ్బాకలో బీజేపీకి చెందిన రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా కొనసాగడంతో బీజేపీ, అప్పటి అధికార పార్టీ బీఆర్‌ఎస్‌ల మధ్య వార్ నెలకొన్న విషయం తెలిసిందే. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి అయి ఏడాదిన్నర అయినా, ప్రభుత్వం వాటి పంపిణీకి పూనుకోలేదు. దీంతో స్థానికంగా ప్రజల నుంచి ఒత్తిడి మొదలైంది. ఇదే అదనుగా ఇరు పార్టీలకు చెందిన వారు.. తమ అనుచరులను, వారి బంధువులను అందులో చేర్చారు. కేటాయింపులు లేకుండానే అనధికారికంగా వారికి ప్రవేశం కల్పించారు. అందులో చాలా మంది స్థానికేతరులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

50 బ్లాక్‌లకే డ్రా

బల్వంతపూర్‌లో 62 బ్లాక్‌లలో.. 12 ఇళ్ల చొప్పున నిర్మించగా, కేవలం 50 బ్లాక్‌లకే అధికారులు డ్రా తీశారు. వాటిలో కూడా మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన 20 మందికి కేటాయించగా, వారు దుబ్బాకకు వచ్చేందుకు నిరాకరించారు. దీంతో మిగిలిన ఇళ్లలో అనర్హులు చేరారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోనే కాకుండా వివిధ జిల్లాల్లో వివాహాలు చేసుకుని వెళ్లిన ఆడబిడ్డలనూ రప్పించి, వారిని డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివాసం ఉంచారు. అంతేకాకుండా కొందరు నాయకులు ఇళ్లకు తాళాలు వేసుకుని.. తాము సేద దీరడానికి మద్యం సేవించడానికి కూడా ఉపయోగిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పేదల సొంతింటి కల నిజం చేస్తామంటూ గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు దుబ్బాకలో అనర్హుల పాలవుతున్నాయి. పేదలకు ఇళ్లు కేటాయించకపోవడంతో ఇష్టారాజ్యంగా ఎవరికి వారు కబ్జా చేస్తున్నారు. పైరవీకారులు.. నేతల అనుచరులు, వారి బంధుగణాన్ని రప్పించి వారికి ఇళ్లను అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం దుబ్బాకలోని చాలా బెడ్‌రూం ఇళ్లు వారి ఆధీనంలోనే ఉన్నాయి.



దుబ్బాక డబుల్ బెడ్రూం ఇళ్లు



ఇప్పటికీ అందని సర్టిఫికెట్లు

దుబ్బాకతో పాటు వివిధ గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లను అధికారికంగా కేటాయించకపోయినా.. కొందరు అందులో నివాసం ఉంటుండటంతో అయోమయం నెలకొన్నది. దుబ్బాక మండలం బల్వంతాపూర్ గ్రామంలో కొంతమంది లబ్ధిదారులను ఎంపిక చేసినా, వారికి ఇప్పటికీ సరిఫికెట్లు అందించలేదు. దీంతో కొందరు 'మీకు సర్టిఫికెట్లు రాకుండా చేస్తాం' అని, కొన్ని చోట్ల ఇళ్ల ఖాళీ చేయాలని బెదిరిస్తున్నట్లు సమాచారం.

విచారణ జరపాలి

దుబ్బాక డబుల్ బెడ్రూం కేటాయింపులపై అధికారులు తిరిగి విచారణ జరపాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నాయకురాలు శ్రీరాం సరస్వతీ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు పోటాపోటీగా అనర్హులను అందులోకి చేర్చారని ఆరోపించారు.



బీఆర్‌ఎస్ చేజారిన తూప్రాన్ బల్దియా పీఠం

- కేసీఆర్ ఇలాకలో నెగ్గిన అవిశ్వాసం
- వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్‌కు తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు

7 లో..

గ్రామాల్లో తాగునీటి సమస్య రావొద్దు

- కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 6: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య రావొద్దని, సకాలంలో తాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయంలో డీపీవో, ఎంపీడీవో, ఎంపీవో మిషన్ భగీరథ ఈఈ, డీఈ, ఏఈ అధికారులు, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా తాగునీటి కొరత ఉన్న ప్రాంతాలు, ఆ సమస్యను ఎలా అధిగమించాలో దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో మిషన్‌భగీరథపైన ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ డ్రైవ్‌లో గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ఎక్కడెక్కడ తాగునీటి కొరత ఉంది. పైప్ లైన్ లీకేజీలు, వాటర్ ట్యాంకు మరమ్మతులు, క్లోరినేషన్ ప్రక్రియతో పాటు గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో దూరంగా ఉన్న నివాసాలకు సైతం తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో, ఎంపీవో మిషన్ భగీరథ ఈఈ, డీఈ, ఏఈ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఎక్కడ ఎలాంటి తాగునీటి కొరత రాకుండా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. పీఎం విశ్వకర్మ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలను పంచాయతీ స్థాయిలో వెరిఫికేషన్ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలన్నారు. ఎన్‌ఆర్ ఈజీఎస్ పనుల్లో భాగంగా కొన్ని మండలాల్లో కూలీల కొరత ఉన్నందున జిల్లా యావరేజ్ ఏ మాత్రం తగ్గకుండా కూలీల సంఖ్య ఎక్కువ మొత్తంలో సమకూర్చుకోవాలని, రానున్న వేసవిలో జిల్లాలోని నర్సరీల నిర్వహణలో చెట్లకు కావాల్సిన జీవామృతం, నీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, జడ్పీ సీఈవో రమేష్, డీపీవో దేవకీదేవి, మిషన్‌భగీరథ ఎస్‌ఈ శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేటలో ఫ్లాగ్ మార్చ్

త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం కేంద్ర బలగాలు సీఐఎస్ఎఫ్‌తో సిద్దిపేటలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు ఆధ్వర్యంలో ఇక్బాల్ మినార్, ముస్తాబాద్ చౌరస్తా, నాసర్‌పుర, బారాయిమామ్, పుష్పాంజలి చౌరస్తా, సుభాష్ రోడ్డు, ఓల్డ్ బస్టాండ్, తదితర ప్రాంతాలలో బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు మాట్లాడుతూ శాంతి పరిరక్షణ గురించి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు వివరించారు.

- సిద్దిపేట క్రైం, మార్చి 6



మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసిన టీఎన్జీవోలు

మెదక్ అర్బన్, మార్చి 6: జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన రాహుల్ రాజ్‌ను బుధవారం కలెక్టరేట్‌లో టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పాలనలో ఉద్యోగులందరూ సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనురాధ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఇక్బాల్‌పాష, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఫజులొద్దిన్, రఘునాథరావు, లీల, సంయుక్తకార్యదర్శి రాధ, విష్ణువర్ధన్‌రెడ్డి, మెదక్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శి రామాగౌడ్, శ్రీకాంత్, వైద్యఆరోగ్యశాఖ ఫోరం జిల్లా కార్యదర్శి మంజుల, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు ప్రధాన రోడ్డులో అదుపు తప్పి కారు బోల్తా

● ఐదుగురికి గాయాలు

శంషాబాద్ రూరల్, మార్చి 6 : శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రధాన రోడ్డు (రోటరీ 1) వద్ద కారు అదుపు తప్పి బోల్తాపడగా ఐదుగురికి గాయలైన సంఘటన బుధవారం రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డికి చెందిన ఐదుగురు కారులో తమ బంధువులను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సెండాప్ చేసి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ఎయిర్‌పోర్టు ప్రధాన రోడ్డులో కారు అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో కారులో ఉన్న ఐదుగురికి స్వల్ప గాయలయ్యాయి. అయితే, ఎయిర్‌పోర్టు ప్రధాన రోడ్డు కావడంతో భారీగా ట్రాఫిక్ జామ్‌అయింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సమాచారం అందుకున్న జీఎంఆర్ రక్షణ సిబ్బంది, స్థానిక ట్రాఫిక్ పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని కారును క్రేన్ సమయంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మహిళలు ఉన్నతంగా ఎదగాలి

● సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్‌రావు



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి ప్రభాకర్‌రావు

సంగారెడ్డి క్రైమ్, మార్చి 6 : మహిళలందరూ ఉన్నతంగా ఎదగాలని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు ఆకాంక్షించారు. మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో మహిళలకు న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా, గృహహింస, పోక్సో వంటి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. మహిళలకు ఎలాంటి సమస్య ఎదురైనా సహాయం కోసం న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి జి.సుదర్శన్, రెండో అదనపు న్యాయాధికారి పి.కృష్ణార్జున, మూడో అదనపు జడ్జి సునీతా రవీందర్‌రెడ్డి, నాల్గో అదనపు జిల్లా జడ్జి ఎం.లావణ్య, సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్, న్యాయాధికారులు పి.లక్ష్మణ్‌చారి, శాలిని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్దన్‌రెడ్డి, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులంలో ఇంటర్ ప్రవేశానికి 10న రెండో లెవల్ పరీక్ష

నర్సాపూర్,మార్చి 6: గిరిజన గురుకులంలో ఇంటర్‌లో ప్రవేశానికి రెండో లెవల్ పరీక్షను 10న కామారెడ్డిలోని గిరిజన గురుకుల డిగ్రీ కాలేజీలో నిర్వహించనున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఉదయం 10గంటలకు ప్రారంభం అవుతుందని విద్యార్థులు గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

మద్యం తాగి వాహనం నడిపిన యువకుడికి జైలు

రామాయంపేట, మార్చి 6 : పట్టణానికి చెందిన మర్కు సురేష్ మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. బుధవారం మెదక్ మొబైల్ కోర్టులో అతడిని హాజరుపరచగా జడ్జి కల్పన ఐదు రోజుల శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఇకనైనా మద్యం సేవించి వాహనాలు తోలవద్దని ఎస్ఐ రంజిత్ సూచించారు.

బీఆర్‌ఎస్ చేజారిన తూప్రాన్ బల్దియా పీఠం

● కేసీఆర్ ఇలాఖాలో నెగ్గిన అవిశ్వాసం

● వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్‌కు తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు



అవిశ్వాసం తీర్మానానికి మద్దతుగా చేతులెత్తిన ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, కౌన్సిలర్లు

తూప్రాన్, మార్చి 6 : మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ పట్టణ మున్సిపల్‌లో చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్‌పై ప్రవేశపెట్టిన అవిశాస తీర్మానం నెగ్గింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరి బీజేపీ మద్దతుతో బీఆర్‌ఎస్ పీఠాన్ని కదిలించారు. తూప్రాన్ పట్టణ మున్సిపల్ కార్యాలయంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తూప్రాన్ డీఎస్పీ సామ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో తూప్రాన్, నర్సాపూర్ సీఐలు కృష్ణ, జాన్‌రెడ్డి, తూప్రాన్ ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు మామిండ్ల జ్యోతికృష్ణ, చెలిమెల ప్రియాంక, పల్లెర్ల జ్యోతి రవీందర్‌గుప్తా, జిన్న భగవాన్‌రెడ్డి, బాణాపురం రాజు, చింత రవీందర్‌రెడ్డి, జమాల్‌పురం లక్ష్మీబాయినర్సీజీ, రామునిగారి శ్రీశైలంగౌడ్, కొడిప్యాక నారాయణగుప్తా ఉదయం 11 గంటలకు పోలీసు రక్షణ మధ్య మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్‌లో సభ్యుడిగా నమోదు చేసుకున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మొదట ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కోరం సమకూరడంతో ఆర్డీవో జయచంద్రారెడ్డి మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం సమావేశాన్ని కొనసాగించారు. ఓటింగ్ కోరగా ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డితోపాటు, పది మంది కౌన్సిలర్లు మద్దతుగా చేతులు ఎత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఆర్డీవో జయచంద్రారెడ్డి ప్రకటించారు. వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్‌ను తాత్కాలిక చైర్మన్‌గా ఆర్డీవో జయచంద్రారెడ్డి ప్రకటించారు. అనంతరం ఆయనకు కమిషనర్ ఖాజా మొహిజుద్దీన్ సమక్షంలో ఆర్డీవో బాధ్యతలను అప్పగించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఎన్నికల కమిషన్‌కు తెలియజేసి మళ్లీ చైర్మన్ ఎన్నికకు తేదీ ఖరారు చేస్తామని ఆర్డీవో తెలిపారు. ఈ సమావేశానికి విలేకరులను అనుమతించలేదు.

చైర్మన్ వర్గం గైర్హాజరు

తూప్రాన్ మున్సిపాలిటీలో 16 వార్డులుండగా, బీఆర్ఎస్ 11, కాంగ్రెస్ ఇద్దరు, స్వతంత్రులు ఇద్దరు, బీజేపీ ఒక్కరు గెలుపొందారు. స్వతంత్రులు ఇద్దరు బీఆర్‌ఎస్‌లో చేరగా, బీఆర్‌ఎస్ ఒకటో వార్డు కౌన్సిలర్ బొంది రాఘవేందర్‌గౌడ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చైర్మన్‌ను సొంత పార్టీ కౌన్సిలర్లు మొదటి నుంచి వ్యతిరేకిస్తూ వచ్చారు. అప్పట్లో మంత్రి హరీశ్‌రావుకు ఫిర్యాదు చేశారు. చైర్మన్‌ను గద్దె దించేందుకు కౌన్సిలర్లు అదను కోసం చూశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య పదికి చేరింది. బీజేపీకి చెందిన కౌన్సిలర్ మద్దతుతో గతనెల 12న అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు అందజేశారు. చైర్మన్ రాఘవేందర్ గౌడ్‌కు నలుగురు కౌన్సిలర్ల మద్దతుతో వారి బలం ఐదుకు చేరింది. తరువాత రెండో వార్డుకు చెందిన కౌన్సిలర్ మామిడి వెంకటేశ్ మళ్లీ చైర్మన్ వర్గంలో చేరిపోయారు. దీంతో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఛాలెంజ్‌గా తీసుకొని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మద్దతు తీసుకున్నారు. సోమవారం ఆగమేఘాల మీద తూప్రాన్ మున్సిపల్‌లో రఘోత్తంరెడ్డిని ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా నమోదు చేయించారు. బుధవారం జరిగిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి చైర్మన్ వర్గం గైర్హాజర్ అయినప్పటికీ, ఎమ్మెల్సీతో కలిపి 11 మంది సభ్యులు హాజరు కావడంతో కోరం సమకూరింది.

తూప్రాన్ ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చింది : మాజీ ఎమ్మెల్యే తూంకుంట

మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో రేపటి నుంచి తూప్రాన్ పట్టణ ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చినట్టేనని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఇన్‌చార్జి చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులతో కలిసి బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన కేసీఆర్ ఒక్కసారి తూప్రాన్ రాలేదని, ఆస్పత్రి ప్రారంభోత్సవానికి ఇలా వచ్చి అలా వెళ్లిపోయారని నర్సారెడ్డి మండిపడ్డారు. తూప్రాన్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు పెత్తనం పెరిగిపోయిందని ఆరోపించారు. దోచుకో.. దాచుకో అన్నట్లుగా వారి వ్యవహారం తయారైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి పాలన అందిస్తామని, ప్రజల సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. ప్రతీ ఒక్కరు చైర్మన్ అనేలా పాలన కొనసాగుతుందని నర్సారెడ్డి హామీ ఇచ్చారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నందాల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈరోజు తూప్రాన్ ప్రజలకు శుభదినమన్నారు. అవినీతి పాలన చేసిన చైర్మన్‌ను దించేశామని సంతోషం వ్యక్తం చేశారు. మద్దతిచ్చిన ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తూప్రాన్ ప్రజలకు ఈరోజు దీపావళి పండుగని, ప్రజాపాలనను కొనసాగిస్తామన్నారు. తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బాణసంచాను పేల్చి సంబురాలు చేసుకున్నారు. కౌన్సిలర్లతోపాటు సర్పంచుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డి, పాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కావేరిగారి భగవాన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా, నేత మహేందర్ రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, మానిక్‌రావు, కృష్ణ పాల్గొన్నారు.



తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

సమష్టి కృషితోనే మోదీ సభ విజయవంతం

● బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి



మాట్లాడుతున్న సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, మార్చి 6 : పటాన్‌చెరు శివారులోని పటేల్‌గూడలో జరిగిన ప్రధాన మంత్రి విజయ సంకల్ప సభను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ధన్యవాదాలను తెలిపారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అందరి సమష్టి కృషి వల్లే మోదీ సభ విజయవంతమైందన్నారు. ప్రధాని సభ ఉందనే విషయాన్ని ఐదు రోజుల ముందే చెప్పారని, అయినప్పటికీ సభ విజయవంతం కోసం మహిళగా ధృడ సంకల్పంతో పనిచేశామన్నారు. మోదీ సభతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నిండిందన్నారు. మోదీ ప్రసంగంతో మళ్లీ ఓట్లు ఎప్పుడొస్తాయో, ఎప్పుడు బీజేపీకి ఓటు వేద్దామో అన్న ఉత్సాహంతో బీజేపీ శ్రేణులున్నాయన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో లేకపోయినా పది లక్షల కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. నలుగురు ఎంపీలుంటేనే అంత అభివృద్ధి జరిగిందంటే 17 స్థానాల్లో బీజేపీ గెలిస్తే రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. మోదీ ఆలోచనలు భవిష్యత్తు బాగుకు నిదర్శనమన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్, జహీరాబాద్ ఎంపీ స్థానాల గెలుపు కోసం అదే ఉత్సాహంతో కష్టపడి పనిచేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. మోదీ సభ సక్సెస్ కోసం సహకరించిన పోలీసు, ఇతర శాఖల అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నర్సింహారెడ్డి, అనంతరావు, రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి విజయ్, పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్‌ఐటీలో జాతీయస్థాయి 'ఈ బాజా'

● ఆయా రాష్ట్రాల నుంచి పాల్గొనున్న 70 టీంలు

● ఎలక్ట్రిక్ వాహనాల ప్రదర్శన

● 11 వరకు కొనసాగనున్న పోటీలు



ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సంస్థల ప్రతినిధులు

నర్సాపూర్, మార్చి 6: మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీ కాలేజీలో జాతీయస్థాయి ఈ బాజా ఈవెంట్ బుధవారం ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలోనే మొదటిసారి తెలంగాణ రాష్ట్రంలో, మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీలో నిర్వహిస్తుండటం విశేషం. దేశంలోని ఆయా ఇంజనీరింగ్ కాలేజీలకు చెందిన మొత్తం 70 టీంలు పాల్గొంటుండగా ఒక్కో టీంలో 25 మంది విద్యార్థులు ఉంటారని నిర్వాహకులు తెలిపారు. రూ.4 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు చేసి విద్యార్థులు స్వయంగా రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను ఈ బాజాలో ప్రదర్శించి తమ ప్రతిభ చాటనున్నారు. బుధవారం నుంచి ఈ నెల 11 వరకు పోటీలు కొనసాగనున్నాయి. ఇందులో ప్రతిభ చాటిన వారికి ప్రముఖ సంస్థలలో ప్లేస్‌మెంట్ కల్పించి ప్రోత్సహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధి సంజయ్‌నిబందే, రెనాల్ట్ నిస్సాన్ టెక్ ప్రతినిధి సంస్థ హీరోటెక్ హరడా, భారత్ పెట్రోలియం సంస్థ రాష్ట్ర ప్రతినిధి అచమ్‌త్రిహన్, కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే తదితరులు పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం వరకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోగా గురువారం నుంచి పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 8వ తేదీన మహిళ దినోత్సవం సందర్భంగా కేవలం విద్యార్థినులే తీర్చిదిద్దిన ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విష్ణు ఎడ్యుకేషనల్ చైర్మన్ విష్ణురాజు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ తమ కళాశాల జాతీయస్థాయి పోటీలకు వేదిక కావడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు ప్రతిభ చాటి మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



పోటీలలో పాల్గొననున్న విద్యార్థులతో ప్రతినిధులు

కోవాలంట్ పరిశ్రమ అగ్నిప్రమాదంలో ఒకరి మృతి

● చికిత్స పొందుతూ ప్రాణాలొదిలిన కెమిస్ట్రీ టెక్నీషియన్

● పరిశ్రమ ఎదుట మృతుడి కుటుంబీకుల ఆందోళన

● సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయింపు

● దిగివచ్చిన పరిశ్రమ యాజమాన్యం

● రూ.45 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం హామీ

● మరో ముగ్గురి పరిస్థితి విషమయం



వినోద్‌కుమార్

హత్నూర, మార్చి 6 : హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూరు శివారులోని కోవాలంట్ ల్యాబొరేటరీస్ పరిశ్రమలో మంగళవారం సాయంత్రం సంభవించిన అగ్నిప్రమాదంలో నలుగురు గాయాలపాలవగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అందులో ఒకరు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రమైన హత్నూర గ్రామానికి చెందిన నీరుడి వినోద్‌కుమార్ కోవాలంట్ పరిశ్రమలో కొంతకాలంగా కెమిస్ట్రీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. రోజువారి మాదిరిగానే మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు విధుల్లోకి వెళ్లాడు. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-4లో వినోద్‌కుమార్‌తో పాటు ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కాంట్రాక్టు కార్మికులు స్వాదిన్‌రాజమల్, లైబాబు తుర్రై, ఫాదర్ మరండి విధులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం సుమారు 5 గంటల ప్రాంతంలో ఏఎన్‌ఎఫ్‌డీ రియాక్టర్ నుంచి మెటీరియల్ ఖాళీ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విధుల్లో ఉన్న నలుగురికి మంటలంటుకోవడంతో కేకలు వేశారు. వెంటనే అప్రమత్తమైన తోటి కార్మికులు సేఫ్టీ పరికరాలను ఉపయోగించి మంటలను అదుపు చేశారు. అప్పటికే తీవ్ర గాయాలైన నలుగురిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కెమిస్ట్రీ టెక్నీషియన్ వినోద్‌కుమార్(27) అర్ధరాత్రి మృతి చెందాడు. కాంట్రాక్టు కార్మికులు ముగ్గురు ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వినోద్‌కుమార్‌కు తల్లిదండ్రులతోపాటు భార్య వీరమణి, ఆరు నెలల బాలుడు ఉన్నారు. వినోద్‌కుమార్ కుటుంబసభ్యులు, బంధువులు బుధవారం పరిశ్రమ ఎదుట ఆందోళన నిర్వహించారు. సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం దిగిరాగా మృతుడి బంధువులతో పలు దఫాలుగా చర్చలు జరిపి రూ.45లక్షల నష్టపరిహారం, ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. హత్నూర తహసీల్దార్ ఫర్హీన్ షేక్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రవీణ్‌కుమార్, జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ సుభాష్ పరిశ్రమను సందర్శించి, ఘటనకు గల కారణాలను పరిశ్రమ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు పరిశ్రమపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.



పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

కేసీఆర్ ఓఎస్డీగా ముత్యంరెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలను స్వీకరించిన ముత్యంరెడ్డి

గజ్వేల్, మార్చి 6: బీఆర్‌ఎస్‌ఎల్పీ నేతగా ఎన్నికైన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓఎస్డీగా ముత్యంరెడ్డి బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఐదేళ్లపాటు గడ ప్రత్యేకాధికారిగా పనిచేసిన ముత్యంరెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో బాధ్యతలను చేపట్టగా తాజాగా గజ్వేల్ క్యాంపు కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి శుక్రవారం వరకు గజ్వేల్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆయనను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కౌన్సిలర్లు సత్కరించారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థి



అజయ్

కోహీర్, మార్చి 6: మండలంలోని దిగ్వాల్ గ్రామ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బి.అజయ్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గోవర్ధన్‌రావు తెలిపారు. రెండు నెలల క్రితం జిల్లాస్థాయికి ఎంపికైన అజయ్ మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. నెలరోజుల క్రితం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు ఖేలో ఇండియా పేరుతో హైదరాబాద్‌లోని బాలయోగి స్టేడియంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీలో అజయ్ ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా అజయ్‌ని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

మద్యం మత్తులో ఇద్దరి మధ్య ఘర్షణ

రాయితో కొట్టి ఒకరి హత్య

● పరారీలో నిందితుడు



యాదయ్య(ఫైల్)

జిన్నారం, మార్చి 5: బొల్లారం మున్సిపాలిటీలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రాథమిక వివరాల ప్రకారం.. గచ్చిబౌలి ఖాజాగూడకు చెందిన యాదయ్య(38) కొంతకాలం క్రితం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీరప్పబస్తీకి తరలివచ్చి నివాసం ఉంటున్నాడు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బొల్లారం ప్రధాన రహదారి సమీపంలో యాదయ్య తనకు పరిచయస్థుడైన మార్ల రాజుతో మంగళవారం రాత్రి మద్యం తాగారు. మద్యం మత్తులో వారిద్దరూ ఘర్షణ పడ్డారు. ఈ గొడవలో రాజు యాదయ్యను రాయితో మోదగా మృతిచెందాడు. ఘటన స్థలాన్ని జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ సందర్శించి కేసు నమోదు చేశారు. కాగా నిందితుడు రాజు పరారీలో ఉండడంతో ఘర్షణకు కారణాలు తెలియరాలేదు. యాదయ్యకు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

సీఎంఆర్ ధాన్యం దుర్వినియోగం చేసిన

మిల్లర్లపై కేసులు

● రూ.49 కోట్ల ధాన్యం స్వాహా

● ఇప్పటికే నలుగురిపై క్రిమినల్ కేసుల నమోదు

మెదక్, మార్చి 6 : కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కోసం కేటాయించిన ధాన్యం దుర్వినియోగం చేసిన మిల్లర్లపై సివిల్ సప్లయ్ అధికారులు క్రిమినల్ కేసులను నమోదు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 21 రైస్‌మిల్లర్లు రూ.49.75 కోట్ల ధాన్యం స్వాహా చేసినట్లు అధికారులు గుర్తించారు. రికవరీ చట్టం ప్రకారం వారు తీసుకున్న ధాన్యం విలువను డబ్బు రూపంలో పౌరసరఫరాల శాఖ అకౌంట్‌లో జమచేయాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి 13 మిల్లులపై చర్యలు తీసుకోనున్నట్లు పెడుతున్నట్లు తెలిపారు. అందులో నలుగురు మిల్లర్లపై క్రిమినల్ కేసులయ్యాయి. ఇందులో భవానీ రైస్‌మిల్, శారదా ట్రేడర్స్, చాముండేశ్వరీ రైస్‌మిల్, సాయికృప రైస్‌మిల్లుల యజమానులపై కేసులు నమోదు చేశారు. మిగతా తొమ్మిది మిల్లులపై నేడో, రేపో క్రిమినల్ కేసులు పెట్టడానికి సిద్ధం చేస్తున్నారు. వారు తక్కువ మొత్తంలో బకాయిలు ఉండడంతో అధికారులు దూకుడుగా వ్యవహరించడం లేదు. రూ.59 లక్షల లోపే ధాన్యం డబ్బు ఉండడం, పైగా ఆ డబ్బు జమ చేసే యత్నంలో ఉన్నట్లు సమాచారం.

లక్ష్యం పూర్తి చేయని మిల్లర్లను వదిలేది లేదు

మెదక్ జిల్లాలో లక్ష్యం మేరకు సీఎంఆర్ ఇవ్వని 21 రైస్‌మిల్లుల జాబితా తయారుచేశాం. వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేయనున్నాం. ఇప్పటివరకు నలుగురిపై ఆర్‌ఆర్ యాక్టు కింద కేసులు పెట్టాం. ఇప్పటికిప్పుడు మరో 9 మందిపై క్రిమినల్ కేసులు పెడతాం. డబ్బు కట్టడానికి ముందుకు వచ్చే మిల్లర్లను వదిలిపెడతాం.

- హరికృష్ణ, సివిల్ సప్లయ్ డీఎం

ఎల్‌ఆర్‌ఎస్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



సిద్దిపేటలోని ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



దుబ్బాకలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



గజ్వేల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ బుధవారం జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలను చేపట్టారు. పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఎల్‌ఆర్‌ఎస్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిద్దిపేట టౌన్, మార్చి 6: రాష్ట్ర ప్రభుత్వం మాట మార్చి ప్రజల నుంచి డబ్బు వసూళ్ల కోసం ఎల్‌ఆర్‌ఎస్‌ను తెర పైకి తెచ్చిందని, వెంటనే రద్దు చేయాలని మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజనర్సు, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాకముందు గ్రామ పంచాయతీ లేవుట్లను ఉచితంగా రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్‌ఆర్‌ఎస్ కట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిరాం, కౌన్సిలర్లు గ్యాదరి రవీందర్, లక్ష్మణ్, తిరుమల్‌రెడ్డి, మొయిజ్ పాల్గొన్నారు.

దుబ్బాకలో..

దుబ్బాక, మార్చి 6: రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వసూలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని దుబ్బాక మున్సిపల్ ఛైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం దుబ్బాక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు వంశీకృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో ఎల్‌ఆర్‌ఎస్ వసూలు నిర్ణయానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎల్‌ఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా కోర్టుల్లో కేసులు వేయించారని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును వసూలు చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇల్లెందుల శ్రీనివాస్, బాలకిషన్, స్వామి, కోఆప్షన్ సభ్యుడు ఆస స్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ హాజరయ్యారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి లబ్ధి చేకూరేలా ఎలాంటి చార్జీలు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హన్మకొండ జడ్పీ ఛైర్మన్ సుధీర్‌కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీ మానస, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు వంగ వెంకట్రాంరెడ్డి, ఎండీ అన్వర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సుద్దాల చంద్రయ్య, వైస్ ఛైర్‌పర్సన్ అయిలేని అనిత, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రజని, ఎడబోయిన తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్ తదితరులున్నారు.

గజ్వేల్‌లో...

గజ్వేల్, మార్చి 6: ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎలాంటి రుసుం లేకుండా అమలుచేయాలని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎల్‌ఆర్‌ఎస్ కట్టవద్దని, ఫ్రీగా అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.20వేల కోట్లను వసూలు చేయడమే లక్ష్యంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు ఎలాంటి రుసుం లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని మెదక్ పార్లమెంట్ ప్రజలకు పిలుపునిచ్చారు. వారితో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ ఛైర్మన్ జకీయోద్దీన్, ఎంపీపీలు పాండుగౌడ్, బాలేషంగౌడ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



కిష్టయ్య (ఫైల్)

వర్గల్, మార్చి 6: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మినాజీపేట శివారులో బుధవారం వెలుగు చూసింది. గౌరారం ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మినాజీపేట గ్రామానికి చెందిన బర్రాల కిష్టయ్య(53) అనే వ్యక్తి మంగళవారం ఉదయం కూలీ పనికి వెళ్తున్నట్టు భార్య మణెమ్మకు చెప్పి ఇంటినుంచి బయలు దేరాడు. అయితే అతడు కూలీ పనికి వెళ్లకుండా మధ్యాహ్న సమయంలో గ్రామ శివారు ప్రాంతంలోని అముసోని కుంట చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి నీట మునిగాడు. కిష్టయ్య రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలిస్తుండగా బుధవారం ఉదయం అముసోని కుంట చెరువులో కిష్టయ్య మృతదేహం నీటిపై తేలింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి బీఆర్‌ఎస్ నాయకుడు..



పాపయ్య (ఫైల్)

బెజ్జంకి, మార్చి 6: రైతుబంధు సమన్వయ సమితి జిల్లా మాజీ మెంబర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అయిల పాపయ్య పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన ఐల పాపయ్య(65) బోదకాలు వ్యాధితో బాధపడుతూ నొప్పి భరించలేక మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న పాపయ్య బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య తార ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శంకర్‌రావు తెలిపారు.

గజ్వేల్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● రూ.49,616 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం

గజ్వేల్, మార్చి 6: పట్టణంలోని పేకాట స్థావరంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ రోడ్డులో గల మహ్మద్ షానవాజ్ ఇంటిపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో వారి నుంచి రూ.49,616 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

కేజీబీవీలో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయపోల్, మార్చి 6: రాయపోల్‌లోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఏ. సుగంధలత పేర్కొన్నారు. డే వాచ్‌మన్ పోస్టు ఒకటి, అసిస్టెంట్ కుక్ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 11న సాయంత్రం 4 గంటలలోపు కేజీబీవీ పాఠశాల రాయపోల్‌లో దరఖాస్తు ఇవ్వాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ

హుస్నాబాద్, మార్చి 6 : హుస్నాబాద్ సీఐగా కె శ్రీనివాస్ బుధవారం పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. సీఐ శ్రీనివాస్ వరంగల్ ఏసీబీ నుంచి హుస్నాబాద్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎర్రల కిరణ్ సిద్దిపేట ఎస్‌బీ సీఐగా బదిలీపై వెళ్లారు.

వేములవాడ ఆలయం ఉత్సవ కమిటీ సభ్యుడిగా వెంకటరమణ

హుస్నాబాద్, మార్చి 6 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం శివరాత్రి ఉత్సవ కమిటీ సభ్యుడిగా హుస్నాబాద్ పట్టణానికి చెందిన వెల్దండి వెంకటరమణను నియమిస్తూ బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణానికి చెందిన వెంకటరమణ ఎస్‌ఎస్‌యూఐ నాయకుడిగా, మార్కెట్‌కమిటీ డైరెక్టర్‌గా, కాంగ్రెస్ నాయకుడిగా పని చేస్తున్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

సిద్దిపేట టౌన్, మార్చి 6: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో బుధవారం సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు రూబి నెక్లెస్ రోడ్డు వద్ద మహిళలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ డాక్టర్ అరుణ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళా వాకర్స్, సిబ్బందికి అన్ని రకాల పరీక్షలు చేసి వారి ఆరోగ్యానికి సంబంధించిన సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసన్నరాణి, యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ ఈద వికాస్, డిప్యూటీ రీజియనల్ హెడ్ రాఘవ, సంజయ్ కుమార్ చౌదరి పాల్గొన్నారు.

అల్వాల్ చెరువులోకి నీటిని వదలాలి

● ప్రధాన రహదారిపై రైతుల రాస్తారోకో



అల్వాల్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

మిరుదొడ్డి, మార్చి 6: మండలంలోని అల్వాల్ గ్రామం చెరువులో నీటిని నింపే కాల్వ పనులను వెంటనే పూర్తి చేసి చెరువును నింపాలని డిమాండ్ చేస్తూ బుధవారం రైతులు రోడ్డుపై బైఠాయించి, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చెరువు కాల్వ పనులను పూర్తి చేస్తేనే చెరువు నిండి తద్వారా పంటపొలాల్లోకి నీరు వస్తాయన్నారు. చెరువులోకి నీటిని విడుదల చేయకపోవడం ద్వారా రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి చెరువుకాల్వను వెంటనే పూర్తిచేసి నీటితో నింపాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయాన్ని తెలుసుకున్న మిరుదొడ్డి ఎస్‌ఐ పరశురాములు, డిప్యూటీ తహసీల్దార్ వీరేష్ అక్కడికి చేరుకుని రైతులను సముదాయించినప్పటికీ రైతులు గంటకు పైగా ఆందోళన చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు హైమద్, రైతులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులను అప్‌డేట్ చేస్తాం

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి



దరఖాస్తులను అప్‌డేట్ చేసుకునేందుకు వచ్చిన జనం

సిద్దిపేట టౌన్, మార్చి6: ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించి గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు మున్సిపల్ కార్యాలయంలోని సిటిజన్ కేంద్రంలో అప్‌డేట్ చేస్తామని, ఎవరూ ఆందోళన పడొద్దని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం గృహజ్యోతి పథకం దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి తరలివచ్చారు. దరఖాస్తుదారులంతా ఒకేసారి ఎగబడటంతో స్వల్పంగా తోపులాట జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం పనివేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్యారంటీ దరఖాస్తులను అప్‌డేట్ చేస్తామన్నారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్‌శాఖ జిల్లా అధికారిగా మోహన్‌రెడ్డి



విద్యుత్ ఎస్‌ఈ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం నాయకులు

సిద్దిపేటరూరల్, మార్చి 6: సిద్దిపేట జిల్లా విద్యుత్ శాఖ అధికారిగా పి. మోహన్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సంవత్సర కాలంగా సిద్దిపేట డివిజనల్ ఇంజనీర్ మహేష్ కుమార్ ఇన్‌చార్జి అధికారిగా వ్యవహరించారు. వరంగల్ ఎన్‌సీడీసీఎల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్ రెడ్డి బదిలీపై సిద్దిపేట జిల్లా అధికారిగా వచ్చారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు, వినియోగదారులకు నిరంతరంగా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఎస్‌ఈని కలిసిన ఉద్యోగులు

సిద్దిపేట టౌన్, మార్చి 6: సిద్దిపేట జిల్లా నూతన సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన పి. మోహన్‌రెడ్డిను తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పయ్యావుల పరశురాములు ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌ఈ కార్యాలయంలో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పాప కనకయ్య, కార్యనిర్వహణ అధ్యక్షుడు మల్లయ్య, సిద్దిపేట డివిజన్ అధ్యక్షుడు, జిల్లా కార్యాలయ నిర్వహణ అధ్యక్షుడు రాజు, కార్యవర్గ సభ్యులు రాజు, ఎల్లారెడ్డి, స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభం



గజ్వేల్ రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏడీఏ బాబునాయక్

గజ్వేల్/జగదేవ్‌పూర్/మర్కుక్/చేర్యాల, మార్చి 6: జిల్లాలోని పలు రైతువేదికలో రైతు నేస్తం పేరిట ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. గజ్వేల్ రైతువేదిక వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, ఉద్యానవన అధికారి సునిత, గజ్వేల్ వ్యవసాయ శాఖ ఏడీ బాబునాయక్, గజ్వేల్ వ్యవసాయాధికారి గుండు నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మర్కుక్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు జగదేవ్‌పూర్, మర్కుక్ మండలాల రైతులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు. రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు వ్యవసాయ సలహాలను, సూచనలను అందిస్తారని ఏడీఏ అనిల్‌కుమార్ వ్యవసాయాధికారులు నాగేందర్‌రెడ్డి వసంతరావులు తెలిపారు. యూట్యూబ్ వీడియోల రూపంలో నూతన సాంకేతిక పద్ధతులను తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జివాగ్రో, ఉద్యాన నిపుణుడు నరోత్తంరెడ్డి, ఇఫ్కో కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. చేర్యాల పట్టణంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చేర్యాల వ్యవసాయాధికారి అఫ్రోజ్, మద్దూరు ఏవో రామకృష్ణ, కొమురవెల్లి ఏవో నరేశ్, ఎంపీటీసీ సుంకరి శ్రీధర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి కట్టుబడి ఉంది



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి, మార్చి 6 : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో నాలుగింటిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే సత్యనారాయణ హాజరై మాట్లాడారు. నియంతృత్వ పాలనకు ప్రజలు బుద్ధి చెప్పి ప్రజాస్వామ్యానికి ఓటు వేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ఈ నెల 11న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ పథకాన్ని అందిస్తామని తెలిపారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశాడో చెప్పి ప్రజలను ఓట్లు అడగాలన్నారు. బీజేపీ ప్రభుత్వం పేద లకు చేసిందేమీ లేదని, దేవుళ్ల పేరిట రాజకీయం చేస్తూ ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రతీ కార్యకర్త సైనికుడిగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోచయ్య, రాష్ట్ర యూత్ కార్యదర్శి కృష్ణ, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కవిత, వివిధ శాఖల అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి మర్పడగ క్షేత్రంలో శివరాత్రి మహోత్సవాలు

కొండపాక, మార్చి 6 : మండలంలోని మర్పడగ విజయ దుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకుడు చెప్పెల హరినాథశర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను ఆయన వివరించారు. గురువారం గణపతి పూజ, స్వస్తివాచనం, ప్రధాన కలశ స్థాపనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం వాహనాలు, బండ్లు తిరుగుతాయన్నారు. రాత్రికి అమ్మవారి బోనాలు జరుగుతాయని, శివరాత్రి సందర్భంగా శుక్రవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రదోష పూజ, రాత్రి శివ కల్యాణం, లింగోద్భవ కాలం మహాభిషేకం తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. శనివారం రుద్రాభిషేకం,నందీశ్వరుడికి అనంత ఘటాభిషేకం ఉంటాయని తెలిపారు.

మల్లన్నను దర్శించుకున్న మాజీ క్రికెటర్



ఆలయ ఆవరణలో ఎంఎస్‌కే ప్రసాద్‌తో భక్తులు

కొమురవెల్లి, మార్చి 6: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని బుధవారం టీం ఇండియా మాజీ క్రికెటర్ ఎంఎస్‌కే ప్రసాద్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయవర్గాలు అతడికి స్వామివారి ప్రసాదం అందించారు.


మహిళలు స్వయంకృషితో ఎదగాలి: నాబార్డ్ డీడీఎం

కుకునూరుపల్లి, మార్చి 6: మహిళలు స్వయంకృషితో వ్యాపారవేత్తలుగా ఎదగాలని నాబార్డ్ డీడీఎం శ్రీసేసిల్ తిమోతి పేర్కొన్నారు. ఐఆర్డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుకునూరుపల్లి మండల కేంద్రంలో మహిళలకు మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ పై ఉచిత శిక్షణను పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు స్వయంకృషితో వ్యాపారవేత్తలుగా ఎదిగినప్పుడే సమాజంలో మరింత గౌరవం పెరుగుతుందన్నారు. మగ్గం వర్క్ పై సొంతంగా వ్యాపారం మొదలు పెట్టాలనుకునేవారికి రుణసదుపాయం కూడా అందజేస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మాజీ సర్పంచ్ జయంతి నరేందర్ ఉచితంగా మగ్గం స్టాండ్లను అందజేశారు. అనంతరం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం శ్రీనివాస్, వీఏసీఎస్ వైస్ ఛైర్మన్ అమరేందర్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, సీసీ లింగం, యాకూబ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రాజలింగం, సంస్థ కోఆర్డినేటర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పొట్లపల్లికి మహాశివరాత్రి ప్రత్యేక బస్సులు

హుస్నాబాద్, మార్చి 6: మహాశివరాత్రి సందర్భంగా పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి జాతరకు హుస్నాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో పొట్లపల్లికి 15 ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామన్నారు. బస్సు చార్జిలు పెద్దలకు రూ. 20, చిన్నవారికి రూ. 10, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. కాగా హుస్నాబాద్ డిపోలో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి 2023-24లో బెస్ట్ ఈపీకే తెచ్చిన మహిళా కండక్టర్లతో పాటు ప్రయాణికులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు, సూపరిండెండెంట్ జి శ్రీధర్, ఎస్ నర్సయ్య తదితరులున్నారు.

కేంద్రం పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



దుబ్బాకలో నారీశక్తివందన్‌ను వీక్షిస్తున్న రఘునందన్‌రావు

దుబ్బాక, మార్చి 6: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేర్కొన్నారు. బుధవారం దుబ్బాక ఆర్యవైశ్యభవన్‌లో మహిళా స్వయం సహాయక బృందం, ఎన్జీవో సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి ఆయన నారీశక్తివందన్ అభియాన్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు బాలేష్ గౌడ్, ఎస్‌ఎన్‌చారి, సుభాష్‌రెడ్డి, ప్రవీణ్, కిషన్, రమణ తదితరులున్నారు.

● **హుస్నాబాద్ టౌన్:** నారీశక్తి వందన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రధాని మోదీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను హుస్నాబాద్ పట్టణంలోని స్వయం సహాయక మహిళాసంఘాల సభ్యులు వీక్షించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నదని అందులో వివరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ తదితరులున్నారు.

మహిళల ఆర్థిక ఎదుగుదలకు 'లక్పత్ దీదీ'పై శిక్షణ

మద్దూరు మార్చి 6: మహిళ ఆర్థికాభివృద్ధికి లక్పత్ దీదీతో జీవనోపాధిని మెరుగుపర్చుకుని లక్షాధికారులు కావాలని ట్రైనర్ విజయ నిర్మల, ఏపీఎం బాబురావు సూచించారు. బుధవారం మండలకేంద్రంలోని మండల జాగృతి సమాఖ్యలో ఏర్పాటు చేసిన లక్పత్ దీదీ యాప్‌పై వీవోఏలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బ్యాంకు నుంచి గానీ, శ్రీనిధి నుంచి గానీ రుణాలు తీసుకున్న మహిళ లందరూ ఆర్థికంగా ఎదగాలన్నారు. ఒక కుటుంబానికి ఒకే ఆదాయం కాకుండా పలు రకాల ఆదాయాలను కల్పించుటకు రుణాన్ని తీసుకుని లక్పత్ దీదీ కావాలని తెలిపారు. అనవసర ఖర్చులు తగ్గించుకుని ఆదాయాన్ని పెంపొందించుకునే జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలన్నారు. గ్రామాల్లో మహిళలందరికీ ఆర్థిక విషయాలను మెరుగుపరిచేలా సమావేశాలు, వారి యొక్క రెగ్యులర్ సమావేశాల్లో విషయాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంజీ వుణ, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

మొగుళ్ల రాజిరెడ్డి కటౌట్ల ధ్వంసం



రాజిరెడ్డి చిత్రపటం ధ్వంసమైన కటౌట్

చేర్యాల, మార్చి 6: మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్‌నేత మొగుళ్ల రాజిరెడ్డి యువసేన పేరిట చేర్యాల, కొమురవెల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ఇటీవల ఏర్పాటుచేసిన కటౌట్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మహాశివరాత్రి సందర్భంగా కొమురవెల్లి మల్లన్న ఆలయానికి హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ మార్గాలగుండా చేరుకునే భక్తులకు స్వాగతం పలుకుతూ చేర్యాల మండలంలోని గుర్జకుంట కమాన్, కొమురవెల్లి శివారు, రాజీవ్‌రహదారి సమీపంలోని ఐనాపూర్ తిమ్మారెడ్డిపల్లి కమాన్ తదితర ప్రాంతాల్లో కటౌట్లు నెలకొల్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సురేఖ, పొన్నం చిత్రపటాన్ని మినహాయించి మొగుళ్ల రాజిరెడ్డి ఫొటోను మాత్రమే ధ్వంసం చేయడం చర్చ నీయాంశంగా మారింది.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చిన్నకోడూరు, మార్చి 6: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ దేవయ్య అన్నారు. మండలంలోని మైలారం గ్రామ పంచాయతీ పరిధిలోని కొండెంగలకుంటలో మంగళవారం రాత్రికనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, హెల్మెట్ వినియోగం, మూఢనమ్మకాలు, మంత్రాలు తంత్రాలు, సామాజిక రుగ్మతల గూర్చి ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పాటలు, సీడీల ద్వారా కళాబృందం సభ్యులు ప్రజలను చైతన్య పరిచారు.

ఈథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాలి

● బెజ్జంకి మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం

బెజ్జంకి, మార్చి 6: గ్రామాల్లో ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ నిర్మల పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నిర్మల అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. వివిధ శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. మండలంలోని గుగ్గిళ్ల గ్రామ శివారులో నిర్మిస్తున్న ఈథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాలని ఎంపీటీసీ సభ్యుడు కొమరి మల్లేశం గౌడ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5 కోట్లు ప్రభుత్వం ఇటీవల రద్దు చేయగా, వాటిని తిరిగి అదే అభివృద్ధి పనులకు కేటాయించాలని ఎంపీటీసీ సభ్యుడు మహేందర్ రెడ్డి తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నిర్మల మాట్లాడుతూ ఐసీడీఎస్ సీడీపీవో పని తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో లక్ష్మప్ప, జడ్పీటీసీ కవిత, మండల కో ఆప్షన్ మెంబర్ మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

అజ్ఞానాన్ని తొలగించి.. విజ్ఞానాన్ని పెంచేదే సైన్స్

మిరుదొడ్డి, మార్చి 6: అజ్ఞానాన్ని తొలగించి... విజ్ఞానాన్ని పెంచేదే విజ్ఞానశాస్త్రమని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సోమగారి నాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మిరుదొడ్డి మండలం అల్వాల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు వెంకటనారాయణ, శ్రీనివాసులు, ఎల్లేష్, మల్లయ్య తదితరులున్నారు.

గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

గజ్వేల్/గజ్వేల్ టౌన్, మార్చి 6: గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ, పిరామల్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జాబ్‌మేళాలో 120మంది విద్యార్థులు పాల్గొనగా, 20మంది ఎంపికై నియామకపత్రాలను అందుకున్నట్లు తెలిపారు. తెలంగాణ స్కిల్ మరియు నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణను ఇవ్వడంతో పాటు ఉద్యోగాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. వారితో పిరామల్ ఫైనాన్స్ డైరెక్టర్ భావన, క్లస్టర్ మేనేజర్ రవి, మునావర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, టాస్క్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ కుమార్, కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ కవిత పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవం



సమావేశంలో న్యాయాధికారి ప్రియాంకను సన్మానిస్తున్న అధ్యాపకులు

గజ్వేల్, మార్చి 6: గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.ప్రియాంక హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులకు సోషల్‌మీడియా, సైబర్ మోసాలను గూర్చి వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఉమాశశి మాట్లాడుతూ మహిళలు ఫోన్‌ను జీవితంలో ఎలా వినియోగించాలో తెలియపరిచారు. అనంతరం న్యాయమూర్తి ప్రియాంకను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారితో డాక్టర్ అనిత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి పంపిణీకి శాశ్వత పరిష్కారం చూపాలి

కొండపాక, మార్చి 6: మండలంలోని ఖమ్మంపల్లిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనపరచుకొని పేదలకు పంపిణీ చేయడంలో శాశ్వత పరిష్కారం చూపాలని బుధవారం ఖమ్మంపల్లి గ్రామస్థులు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 1061 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేశారనే విషయాన్ని అధికారులతో పాటు ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేశారు. భూమిని సర్వే చేసి హద్దులు గుర్తించే వరకు ఎవరు ఆ స్థలంలోకి వెళ్లవద్దని ఇరువర్గాల వారు ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో శాశ్వత పరిష్కారం తీసుకోవాలని హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ భూమిరెడ్డి, గ్రామ ఎంపీటీసీ యాదగిరి, నాయకులు తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు.